
కొత్తకోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


తొర్రగుడిపాడులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

## సాయిబాబాకు ప్రత్యేక పూజలు

చీమకుర్తి: మండలంలోని గాడిపర్తివారిపాలెంలోని సాయిబాబా మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మందిరం నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి పూజల్లో పాల్గొన్నారు.


సాయిబాబాకు పూజలు చేస్తున్న మారం వెంకారెడ్డి

# జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: అర్హులందరికీ సంక్షేమ పథకాలకు కావాల్సిన సర్టిఫికెట్లు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. చీమకుర్తి మండలంలోని తొర్రగుడిపాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వెంకాయమ్మతో పాటు స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొని సంక్షేమ పథకాల లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సంతనూతలపాడు–2 సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొని సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చీమకుర్తిలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు యద్దనపూడి అంజమ్మ, కర్నాటి హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొనగా, సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ ఆరోపణలు సిగ్గుచేటు : ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు**

మద్దిపాడు: చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై తీవ్రమైన ఆరోపణలు చేయడాన్ని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఖండించారు. మద్దిపాడు మండలంలోని మద్దిపాడు, ఘడియపూడి సచివాలయాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కరోనా సమయంలోనూ ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందిస్తూ ప్రజలకు కావాల్సినవన్నీ సమకూర్చిన వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ అభాండాలు వేసి బురదచల్లడం అన్యాయమని అన్నారు. పవన్ కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్యాకేజీ స్టార్ ఇంతకంటే ఎక్కువ మాటలు మాట్లాడితే ప్రజలే తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వలంటీర్లు మొత్తం ఏకమైతే పవన్ కళ్యాణ్ పరిస్థితి దారుణంగా మారుతుందని హెచ్చరించారు.

**అర్హులందరికీ పథకాలు...**

అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అందులో భాగంగానే జగనన్న సురక్షలో అవసరమైన సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సుభిక్ష పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా దీవించాలని కోరారు. ఇప్పటికే ఎన్నికల మ్యానిఫెస్టోలో 99 శాతం హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పూర్తి చేశారని, ఇంకా ఎవరికైనా సాంకేతిక కారణాల వలన పథకాలు అందకుంటే వారికి కూడా అవసరమైన పత్రాలు అందించి పథకాలు అందేలా మేలు చేయడం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే వివరించారు. దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, వైస్ ఎంపీపీ మోరబోయిన విజయలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గట్టినేని అయ్యన్న, మోరబోయిన సంజీవరావు, మజీద్, సన్నపురెడ్డి రమణమ్మ, పూనాటి అప్పారావు, రాయపాటి రమేష్, కోఆప్షన్ మెంబర్ మూసా, హౌసింగ్ డైరెక్టర్ విజయకుమార్, కొమ్మూరి సుధాకర్, గ్రామ సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ ఆశాజ్యోతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**ఘడియపూడిలో...**

గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, గ్రామ సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, గార్లపాడు సర్పంచ్ దేవరపల్లి గంగిరెడ్డి, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, రావూరి ప్రసన్నాంజనేయరెడ్డి, బోడిపోగు యాకోబు, అనపర్తి చిరంజీవి, బొమ్మల దాసు, రావూరి అశోక్‌రెడ్డి, అన్వేష్, తహసీల్దార్ రజనీకుమారి, ఏవో సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**నాగులుప్పలపాడు మండలంలో...**

నాగులుప్పలపాడు: మండలంలోని కొత్తకోట సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామస్తులకు పలు రకాల సర్టిఫికెట్లు అందించారు. కనపర్తి–2 సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, గ్రామ సర్పంచ్ చిన్నం సుజాత, సురేష్, కుమ్మూరి సుధాకర్, ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పారదర్శకంగా సంక్షేమ పథకాలు...**

రంగాయపాలెం (కొత్తపట్నం): ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. సోమవారం రంగాయపాలెం తుఫాన్ షెల్టర్‌లో పాదర్తి, రంగాయపాలెం సర్పంచ్‌లు కట్టా సౌందర్య, గాలి స్వరూప అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డీటీ అర్జున్‌రెడ్డి, ఎంపీటీసీ భర్త గుడి నాగిరెడ్డి, ఉపసర్పంచ్ గౌస్‌బాషా కట్టా శేఖర్, గాలి ముసలారెడ్డి, పంచాయతీ కార్యదర్శి హుస్నారాబేగం, కరిముల్లా, అజీమ్, నిమ్మల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ఇంటికీ మేలు జరిగే కార్యక్రమం...**

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రతి ఇంటికి మేలు జరుగుతుందని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నగరంలోని 21వ డివిజన్‌లోని ధారావారితోట, దేవుని చెరువు ఏరియాల్లో జగనన్న సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**చేజర్లలో...**

ఒంగోలు రూరల్: మండలంలోని చేజర్ల గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఒంగోలు తహసీల్దార్ పి.మురళి పాల్గొన్నారు. చేజర్ల గ్రామ సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఈవోఆర్డీ పాల్గొని పలువురికి సర్టిఫికెట్లు అందించారు. అనంతరం వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## ప్రతి సర్టిఫికెట్ ఉచితం

● జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు పంపిణీ చేసిన మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన ప్రతి సర్టిఫికెట్‌ను ఉచితంగా ఇస్తున్నట్లు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. స్థానిక 14వ డివిజన్‌లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ 14వ డివిజన్ సంతపేట సచివాలయం పరిధిలో వారం రోజులు సర్వే చేశామన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫీజు లేకుండానే ఉచితంగా సర్టిఫికెట్లు అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకుడు సయ్యద్‌జలీల్, అసిస్టెంట్ కమిషనర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 12వ డివిజన్‌లోని మరాఠిపాలెం, రంగుతోట సచివాలయాల పరిధిలో కూడా జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఎస్‌కే జిలానీబాషా, వైఎస్సార్ సీపీ నాయకుడు కఠారి లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.


14వ డివిజన్‌లో సర్టిఫికెట్లు అందిస్తున్న మేయర్ గంగాడ సుజాత


ఒంగోలులో సర్వే చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్, సిబ్బంది


రంగాయపాలెంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, రవీంద్రరెడ్డి, అధికారులు


చేజర్లలో సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్, ఈవోఆర్డీ

# పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు, నాయకులు

● ఒంగోలు మండలంలోని వలంటీర్లు డిమాండ్

ఒంగోలు రూరల్: కరోనా సమయంలో సైతం ప్రాణాలకు తెగించి కేవలం గౌరవ వేతనంతో విశేష సేవలందిస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులని, ముఖ్యమంత్రిని ఏకవచనంతో పిలుస్తానని బహిరంగ వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఒంగోలు రూరల్ మండలంలోని వలంటీర్లు డిమాండ్ చేశారు. మండలంలోని కరవది సచివాలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం వలంటీర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గుండాయపాలెం, దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం, ఉలిచి, వలేటివారిపాలెం తదితర గ్రామాల వలంటీర్లు పాల్గొని మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా కేవలం ప్రజాసేవకే తామంతా వలంటీర్లుగా చేరామన్నారు. అలాంటి తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ–1 మన్నె శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ డి.కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు క్రాంతి, సచివాలయ కన్వీనర్ సోమశేఖర్, పలు గ్రామాల వలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలకు సమాధానం చెబుతాం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్

ఒంగోలు టౌన్: తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష పార్టీలకు సరైన సమాధానం చెబుతామని బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. బీజేపీ నూతన అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి బాధ్యతల స్వీకార మహోత్సవ సన్నాహకాలపై స్థానిక విష్ణుప్రియ కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. పొగాకు రైతుల సమస్యలపై వెంటనే స్పందించి 5 శాతం అపరాధ రుసుం రద్దు చేయడంలో పొగాకు బోర్డు సభ్యుడు బోడపాటి బ్రహ్మయ్య కృషి ఉందని చెప్పారు. రైతుల సమస్యలపై తక్షణమే స్పందించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 13న పురందేశ్వరి బాధ్యతలు చేపట్టనున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి విజయవాడ వస్తున్న ఆమెకు అపూర్వ స్వాగతం పలికేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి కోరారు. విలేకరుల సమావేశంలో సురేంధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, డి.ఆంజనేయులు, ధనిశెట్టి రాము, జువిగుంట కోటేశ్వరి, జజ్జర కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

## నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కురిచేడు: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తనయుడు బూచేపల్లి కమలాకరరెడ్డి వర్ధంతి సందర్భంగా చీమకుర్తిలోని బూచేపల్లి వెంకాయమ్మసుబ్బారెడ్డి కల్యాణ మండపంలో ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్న నేత్ర వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు, మందులు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వాళ్లు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుతో రావాలని ఆయన సూచించారు.



## విద్యార్థులు పాఠశాలల్లో ఉండాలి

త్రిపురాంతకం: విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్పి డ్రాపౌట్స్ లేకుండా చూడాలని విద్యాశాఖాధికారులు కె.తులసి మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డిలు కోరారు. త్రిపురాంతకంలోని ప్రైవేటు పాఠశాలలను వారు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులంతా పాఠశాలల్లో ఉండాలని సూచించారు.

## కేజీబీవీ తనిఖీ

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంఈవో శామ్యూల్‌జాన్ సోమవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు తప్పని సరిగా లెసన్ ప్లాన్స్ తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకుని వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి ఉన్నారు.

## తప్పిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత

రాచర్ల: మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌వలి అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ శనివారం తన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటి నుండి వెళ్లిపోయిన షేక్ ఖాదర్‌వలి భార్య ఖాశింబీ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జి.కృష్ణపావని గాలిస్తున్న నేపథ్యంలో ఖాదర్‌వలి గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం భార్యకు సమాచారం అందించి తహసీల్దార్ ఎం.దిలీప్‌కుమార్ సమక్షంలో తప్పిపోయిన షేక్ ఖాదర్‌వలిని అతని భార్య షేక్ ఖాశింబీకి అప్పగించారు.

## బాల్య వివాహాల నిరోధానికి కృషిచేయాలి

మార్కాపురం టౌన్: బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలని సీఐ భీమానాయక్ మహిళా పోలీసులకు సూచించారు. సోమవారం పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. మహిళా పోలీసులు తమ పరిధిలో ఏం జరుగుతుందో రోజూ గమనించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం, సంఘటనలను వెంటనే తెలపాలని సూచించారు. మహిళ, శిశు సంక్షేమశాఖ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది తమ పరిధిలో కార్యక్రమాలు తెలుసుకునే విధంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీడీపీఓ సుశీల పాల్గొన్నారు.